క్లుప్తంగా

శ్రీవిజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసిఉన్న శ్రీ పంచభూత మరకత లింగేశ్వర సహిత శ్రీ చక్ర సమన్విత శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయంలో మూలా నక్షత్రం పురస్కరించుకుని 16వ చండీహోమం నిర్వహించారు. శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు సత్య కిరణ్ పూజలు నిర్వహించారు. పామర్తి వెంకటేశ్వరరావు- పద్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. చండీ హోమం అనంతరం ప్రసాద వితరణ చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



అశోక్‌వర్ధన్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పాత్రికేయుడు అశోక్ వర్ధన్ సంతాప సభ సోమవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో జరిగింది. సభకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కే ఆజాద్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ మాట్లాడుతూ అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. సభలో అశోక్‌వర్ధన్ కుటుంబ సభ్యులకు రూ.54 వేలు, 100 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నరాటాలు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే షకీలా, అధికారులు రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్



ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ సుమన్‌కు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ సి.సుమన్ సోమవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



వెంకటేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.1,00,026 విరాళంగా అందజేశారు. దెందులూరు మండలం మేదినరావుపాలెంకు చెందిన తాళ్లూరి వెంకటేశ్వరరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ప్రభుత్వ లక్ష్యాలు సాధించడమే కర్తవ్యం

దెందులూరు: దెందులూరులో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో సోమవారం మాసిక మహోత్సవంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. ఉద్యోగులు ఐసీడీఎస్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారని, లబ్ధిదారులు వీటి ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, నూతన శోభను సంతరించుకున్నాయని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించమే ఏకైక కర్తవ్యంగా అంకితభావంతో ఉద్యోగులు సేవలందించాలన్నారు. మహోత్సవంలో అంగన్‌వాడీ చిన్నారులు, కిషోర బాలికలు ఉన్నారు.

పండుగ చేసే వరకు.. పండు ముట్టరు

- గిరిజన సంప్రదాయానికి ప్రతీక బాట పండుగ
- పండుగ తర్వాతే జీడిమామిడి, మామిడి, పనస పండ్ల ఆరగింత
- పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం



బాట పండుగ సందర్భంగా వనదేవతకు నైవేద్యం సమర్పిస్తున్న దృశ్యం (ఫైల్)



గ్రామస్తులు వనదేవతకు పూజలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: ఆదివాసీ గిరిజనులు ప్రకృతితో మమేకమై జీవిస్తుంటారు. అందుకే వారి ఆచారపు అలవాట్లు సంప్రదాయాలు చాలా వైవిధ్యభరితంగా ఉంటాయి. గిరిజనులు నిర్వహించే పండుగలలో బాట పండుగ ఒకటి. ప్రతి ఏటా జీడిమామిడి, మామిడి, పనస పండ్లు, చింత చెట్లు కాపు కాసే సమయంలో కొండరెడ్డి గిరిజనులు ఈ బాట పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. పండుగ నాడు ఉదయం వనదేవతకు పూజలు చేసి ధూపదీపాలతో పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. పూజా సమయంలో గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తూ అందరు ఆనందంగా గడుపుతారు. అనంతరం గ్రామస్తులందరూ సహపంక్తి భోజనం చేస్తారు. బాట పండుగ తర్వాత జీడిమామిడి, మామిడి, పనస పండ్లు, చింతపుండును కొండరెడ్డి గిరిజనులు తింటారు. అప్పటివరకు చిన్నా పెద్ద ఎవ్వరూ కూడా పండును ముట్టుకోకపోవడం విశేషం. ఇది తరతరాలుగా వారి పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం. నేటి తరంవారు కూడా ఇదే పద్ధతిని పాటిస్తున్నారు.

మొదలైన పండుగ సందడి

గిరిజన ప్రాంతంలో అత్యధికంగా చింతవృక్షాలు ఉన్నాయి. అలాగే మామిడి చెట్లు, జీడిమామిడి తోటలు ఉన్నాయి. అవి ఈ ఏడాది ఎక్కువగా కాపు కాశాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో బాట పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకుంటుండగా, మరి కొన్ని గ్రామాల్లో పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బాట పండుగ, పప్పు పండుగలే వీరికి ప్రధాన పండుగలు. గత వారం రోజుల నుంచి ముంజులూరు, చింతపల్లి, గడ్డపల్లి, అలివేరు, ఉప్పరిల్ల తదితర గ్రామాల్లో బాట పండుగ వేడుకలు జరుగుతున్నాయి.

బాట పండుగ మా ఆచారం



బాట పండుగ అనేది మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం. పండుగ చేస్తే కానీ చింతకాయ, మామిడి, పనస, జీడిమామిడి పండ్లను ముట్టుకోము. అవి కొయ్యాలంటే ముందుగా కొండదేవతలకు నైవేద్యాలు సమర్పించి ఆటపాటలతో మెప్పిస్తాము. అనంతరం పండ్లను తింటాము.

– సీహెచ్ లచ్చిరెడ్డి, ముంజులూరు, బుట్టాయగూడెం మండలం

ఇదే మాకు పెద్ద పండుగ



బాట పండు అనేది మా నమ్మకం. వన దేవతకు పూజ చేస్తేనే మాకు సంతోషం. మమ్మల్ని చూసే తల్లులు కొండదేవతలు. అందుకే మేము ఏ పనిని మొదలు పెట్టినా ముందుగా పూజలు చేస్తాం. నృత్యాలు చేస్తాం. బాట పండుగే మాకు పెద్ద పండుగ.

– ఎస్ చిన్నారెడ్డి, ముంజులూరు, బుట్టాయగూడెం మండలం

మాసిక మహోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దళితవాడ ఎంపీపీ స్పెషల్ స్కూల్ నందు మాసిక మహోత్సవం-2024 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషోర బాలికలు, తల్లులకు ఋతుక్రమ సమయంలో ఉపయోగించే ఉత్పత్తులు, వాటిని పడవేసే విధానాల గురించి అవగాహన కల్పించారు. ఋతుక్రమ సమయంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, అత్యవసర సమయంలో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.బ్యూలా, సూపర్‌వైజర్లు కె.లక్ష్మి, ఎండీ సల్మా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ వర్ధంతి



నెహ్రూ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పంచవర్ష ప్రణాళికతో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దార్శనికుడు మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ముప్పిడి చినబాబు పేర్కొన్నారు. గణేష్ సెంటర్లోని నెహ్రూ విగ్రహం వద్ద 60వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధునిగా భారతదేశ తొలి ప్రధానిగా నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రిక్షా పుల్లర్స్, ఎమ్మార్పీఎస్ యూత్ నాయకులు, హమాలీ జట్టు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరావు

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలని, వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి ఎ.ప్రభాకరరావు, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంజీవరత్నం కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గత రెండు నెలలుగా మండలంలోని ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో వేతన బకాయిలు రూ.40 లక్షల వరకు చెల్లించాలని, వేతనాలు అందక కూలీలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యుడు పిల్లి చంటి అధ్యక్షత వహించగా సభ్యులు జోడే సూర్యచంద్రరావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, వామిశెట్టి నరసరావు, కె.సుబ్బారావు బి వెంకన్న, ఎం.సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి రాజేష్

కొయ్యలగూడెం: బాలికా సంరక్షణ ధ్యేయంగా ఐసీడీఎస్ శాఖ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి పంతగాని రాజేష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలను నిరోధించడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, బడి ఈడు పిల్లలు బడిబాట పట్టే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం, పోలవరం మండలాలకు చెందిన కరోనా బాధిత కుటుంబాల వారితో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా కరోనా సమయంలో కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోయిన వారికి ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం గురించి వివరించి, వారి చేత దరఖాస్తులను స్వీకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంబటి సరస్వతి, నయోమీరాణి, వై రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగంకు ఘన నివాళి



వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతలపూడి: స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 105వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వీరేశలింగం పంతులు చిత్రపటానికి మహిళా సంఘం నేతలు ఎం వరలక్ష్మిదేవి, పి గోపలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ సూర్యకుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలను వ్యతిరేకించడమే కాకుండా మహిళలందరికీ విద్య అందేలా కృషి చేసిన మహనీయుడు వీరేశలింగం పంతులు అని కొనియాడారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ అశోక్, ఎ రాహుల్, ఎం బాలరాజు, ఆర్‌వీఎస్ నారాయణ, డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి, వరి విత్తనాలు ఉచితంగా అందించాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కుక్కునూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా రైతులకు పత్తి, వరి విత్తనాలు ప్రభుత్వం ఉచితంగా అందించాలని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి కోరారు. ఈమేరకు సీపీఐ నాయకులు సోమవారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం జూనియర్ అసిస్టెంట్ నరసింహరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ గతేడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణమే పంట బీమాను చెల్లించి రుణమాఫీ చేయాలని కోరారు. అంతేకాక పంట రుణాలను బ్యాంకుల నుంచి అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. విలీన మండలాల్లో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోడే రమేష్, సోడే మంగయ్య, మడివి సోమయ్య, పిట్టా దేవా, సోడే రాజు, చోడే కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్ నుంచి కన్యాకుమారి వరకు కాలినడక



దెందులూరు హైవే వద్ద మొక్క నాటుతున్న శివకరణ్‌సింగ్

దెందులూరు: పర్యావరణ పరిరక్షణ, సనాతన హిందూ ధర్మం, సంస్కృతి పరిరక్షణకు అవగాహన కల్పించడం కోసం, దేశం వెలుపల రేయింబవళ్లు నిద్రాహారాలు మాని రక్షణగా ఉన్న సైనికుల కోసం జాతీయ ప్రచారకర్త శివకరణ్‌సింగ్ 13,800 కిలోమీటర్లు కాలినడకన చేసి సోమవారం దెందులూరుకు విచ్చేశారు. ఆయనకు దెందులూరు నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుగ్గిశెట్టి నూకరాజు, సిబ్బంది, దెందులూరు శ్రీరామదండు సభ్యులు ఘన స్వాగతం పలికారు. శాలువా, బొకేలతో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ నూకరాజు మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణ కోసం ఎందరో మహానుభావులు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ వారి అభీష్టానికి అనుగుణంగా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. సైనికులు లేకపోతే దేశం వెలుపల కోట్లాది మంది ప్రజలకు రక్షణ కరువవుతుందన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం ధైర్యాన్ని నింపడం అమరవీరులకు నిజమైన నివాళిగా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మధు, మిరపల రాజేష్, దేవినేని తులసిదాసు, హేమంత్, సప్పా శ్రీనివాసరావు, కొలుసు నాని, ఇప్పిలి వెంకటేశ్వరరావు ఉన్నారు.

మాతా రమాబాయి త్యాగం అందరికీ ఆదర్శం



మాతా రమాబాయి వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మాతా రమాబాయి త్యాగం అందరికీ ఆదర్శనీమని, మహిళా లోకానికి ఆమె స్ఫూర్తి అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. మాతా రమాబాయి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక నరసింహారావుపేటలోని ఎస్‌సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మాతా రమాబాయి చిత్రపటానికి దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో సంతోష్‌కుమార్ మాట్లాడారు. మహనీయుల కృషి ఫలితంగా నేటి మహిళలు రాష్ట్రంలో, దేశంలో ఉన్నత విద్యనభ్యసించడం, ఉద్యోగాలు చేయటం, స్వేచ్ఛగా జీవించడంతోపాటు పురుషులతో సమానంగా సర్వహక్కులు కలిగి ఉన్నారని అన్నారు. ఆనాడు రమాబాయి అహర్నిశలు శ్రమించి డబ్బులు కూడబెట్టి ఆమె భర్త బాబా సాహెబ్ అంబేడ్కర్ చదువుకు అందించడం వల్లే ఈ సమాన్నత్వం సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రాజ్యాంగం రాసి ఈ దేశానికి అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు, మానవ హక్కుల పరిరక్షకుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ విజయాల వెనుక రమాబాయి కృషి ఉందని గుర్తు చేశారు. కులమతాలతో సంబంధం లేకుండా స్త్రీలకు అన్ని హక్కులు కల్పించిన బాబా సాహెబ్ రాసిన రచనలను అందరూ చదవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో గారపాటి నాగేశ్వరరావు, కనికెల్లి రవిప్రసాద్, కె.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంత్యుత్సవాలు ప్రారంభం



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద సుందరకాండ పారాయణ చేస్తున్న మహిళలు



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో 23వ హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవతో అర్చకులు పూజా క్రతువులను ప్రారంభించారు. స్వామివారికి అర్చన చేశారు. అనంతరం దాతల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. 1008 గులాబి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వెనుక భాగాన ముముక్షు భజన సమాజం, హనుమాన్ జంక్షన్ సుందరకాండ పారాయణ చేసారు. సాయంత్రం వెండి బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, నక్షత్ర హారతి అందించారు. జై హనుమాన్ భజన మండలి హనుమాన్ జంక్షన్ వారి కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి మిమిక్రీ, స్వాతి ఆర్కెస్ట్రా భీమవరం వారి మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన జేసీ

పెదపాడు: దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి సోమవారం తనిఖీ చేశారు. ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూం వద్ద భద్రతను జేసీ పరిశీలించారు. ఈవీఎంలకు తలుపులకు వేసిన తాళాలను, సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో జేసీ సంతకం చేశారు.

వాలీబాల్‌తో కొట్టారంటూ ఫిర్యాదు


పెదవేగి : రోడ్డుపై వెళుతున్న తనను ముగ్గురు యువకులు వాలీబాల్‌తో కొట్టారని ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై ఎం రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం వేగివాడలో ఈనెల 23న రోడ్డుపై వెళుతుండగా జాలాది సుధీర్, మరో ఇద్దరు యువకులు వాలీబాల్‌తో కొట్టారని బాధితుడు దాసరి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

వాలీబాల్ ఆడుకుంటున్న తమపై ఓ వ్యక్తి కులం పేరుతో దూషించాడని జాలాది సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 23న పెదవేగి మండలం వేగివాడలోని కొంతమంది యువకులు వాలీబాల్ ఆడుతున్న సమయంలో దాసరి రామకృష్ణ స్థానిక యువకులను కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేయగా, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుమరుగవుతున్న కుంకుడు చెట్లు

- కుంకుడు చెట్లతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు
- షాంపూల డిమాండ్‌తో వాటికి ఆదరణ కరువు
- కుంకుడు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలంటున్న గిరిజనులు



అలివేరు అటవీ ప్రాంతంలో ఉన్న కుంకుడు చెట్టు



చెట్టుకు కాసిన కుంకుడు కాయలు



జీసీసీ ద్వారా విక్రయిస్తున్న కుంకుడుకాయలు

బుట్టాయగూడెం: పూర్వపు రోజుల్లో పండుగలకు, ఇంట్లో శుభకార్యాలకు కుంకుడు పులుసుతోనే తలస్నానం చేసేవారు. దానివల్ల జుట్టుతో పాటు నేత్రాలకు కూడా ఎంతో మంచిదని పూర్వీకులు చెప్పేవారు. అదే పద్ధతి చాలాకాలం వరకు కొనసాగుతూ వచ్చింది. అయితే రానురాను మారుతున్న కాలంతో పాటు రకరకాల షాంపూలు మార్కెట్‌లోకి రావడంతో కుంకుడు కాయలతో తలస్నానం చేసేవారు కరువయ్యారు. ఇంకా పూర్వీకులు ఎవరైనా అదే పద్ధి చెప్పినా ఇప్పటి వారు వినే పరిస్థితుల్లో లేరు. షాంపులపైనే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. అలాగే పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గతంలో కుంకుడు చెట్లు అధికంగా కనిపించేవి. కుంకుడుకాయలతో మాత్రమే తలస్నానాలు చేసేవారు. అయితే రానురానూ అవి కూడా కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. చెట్లను నరికి వేయడంతో కుంకుడు చెట్లు కనుమరుగయ్యే పరిస్థితులు వచ్చాయి. ప్రస్తుతం అక్కడక్కడ కుంకుడు చెట్లు కనిపిస్తున్నాయి. భవిష్యత్‌లో అవి కూడా కనిపించని పరిస్థితులు నెలకొంటున్నాయి.

పశ్చిమ ఏజెన్సీలో లభించని కుంకుడుకాయలు

గిరిజనులు అటవీ ప్రాంతంలో సేకరించే అటవీ ఉత్పత్తుల్లో కుంకుడు కాయలు ఒకటి. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా కుంకుడు కాయలు కేజీ రూ.60 చొప్పున కొనుగోలు చేస్తూ ఉంటారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో కుంకుడు కాయలు అంతగా లభించకపోవడంతో ప్రకాశం జిల్లా, కర్నూలు, డోర్నకల్, శ్రీశైలం జిల్లాల నుంచి కొనుగోలు చేసి ఇక్కడికి తరలిస్తున్నట్లు అధికారులు చెప్పుతున్నారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా కుంకుడు కాయ షాంపు తయారీ కేంద్రాన్ని అల్లూరి జిల్లా రంపచోడవరంలో ఏర్పాటు చేశారు. అక్కడ కుందుడు షాంపులు తయారు చేసి జీసీసీ సూపర్ మార్కెట్లు, డిపోల్లో విక్రయిస్తున్నారు. అలాగే పిక్క తీసిన కుంకుడు ప్యాకెట్లును జీసీసీ విక్రయాలు చేస్తున్నారు. కుంకుడు కాయల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నందున అటవీ శాఖ అధికారులు నర్సరీల ద్వారా కుంకుడు చెట్ల పెంచడం ద్వారా గిరిజనులకు ఆదాయం చేకూర్చే విధంగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇతర జిల్లాల నుంచి కొంటున్నాం



పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో కుంకుడుకాయల సేకరణ తగ్గింది. గిరిజనులు కూడా జీసీసీకి కుంకుడు కాయలు తీసుకురావడంలేదు. దీనితో ప్రకాశం జిల్లా, కర్నూలు, డోర్నకల్, శ్రీశైలం జిల్లాల్లోని అటవీప్రాంతం నుంచి సేకరించిన కుంకుడు కాయలను కొనుగోలు చేస్తున్నాం. పిక్కతీసి ప్యాకెట్‌ల ద్వారా వినియోగదారులకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారు.

జి.పార్వతీశ్వరరావు, జీసీసీ డీఎం, రంపచోడవరం